హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 19.4



సభలో మాట్లాడుతున్న కేసీఆర్, పాల్గొన్న నాయకులు

ఫ్లోరైడ్ పీడ విరగడ

బీఆర్ఎస్ హయాంలోనే

- నల్లగొండలో నాడు ఆముదాలు, బత్తాయితోటలే ఉండేవి
- ధాన్యపురాశుల కేంద్రంగా మార్చాం
- ప్రజలపక్షాన పోరాడతాం
- మంత్రులు సోయిలేకుండా మాట్లాడుతున్నారు
- మాజీ సీఎం కేసీఆర్

'పారుగున కృష్ణానది ప్రవహిస్తున్నా నల్లగొండ జిల్లాకు ప్రత్యేక రాష్ట్రం వచ్చేంతవరకు గుక్కెడు తాగునీరు ఇవ్వలేకపోయారు.. ఇదే జిల్లాలో లక్షన్నర మంది మునుగోడు, దేవరకొండ ప్రజలు ఫ్లోరోసిస్ మహమ్మారితో నడుములు వంగి చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలతో ఉండేవారు.. చివరికి ఇక్కడి ఉద్యమకారులు ఫ్లోరైడ్ బాధితులను నాటి ప్రధాని టేబుల్‌పై పడుకోబెట్టి సమస్య వివరించినా ఏమీ చేయలేదు.. నాడు మంత్రులు, ఎమ్మెల్యేలున్నా ఏమీ చేయలేకపోయారు.. చివరికి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఫ్లోరైడ్ పీడ విరగడైంది' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం నల్లగొండలో జరిగిన 'కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల సాధన సభ'లో కేసీఆర్ మాట్లాడారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చిన కేసీఆర్, కాలునొప్పికారణంగా చేతికర్ర సాయంతో నెమ్మదిగా సభావేదికపైకి వచ్చారు. సభకు అన్నివైపులా ప్రజలకు అభివాదం చేసి, ఆరోగ్యం బాగోలేనందున కుర్చీలో కూర్చొని మాట్లాడవచ్చా.. అని సభికులను అడిగి ఆమోదం తీసుకున్నారు. ఆ తరువాత కుర్చీలో కూర్చొని సుమారు 40నిమిషాలపాటు మాట్లాడారు. ఒక నాడు నల్లగొండ జిల్లాలో ఆముదాలు, బత్తాయిల తోటలతోనే రైతులు బతికేవారని, కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ నాలుగు లక్షల టన్నుల ధాన్యాన్ని పండించే జిల్లాగా తీర్చిదిద్దామన్నారు. వచ్చిపోయే విద్యుత్ స్థానంలో 24గంటలు నిరంతరాయంగా సరఫరా చేశామని, ఇంటింటికీ తాగునీటి నల్లాలు పెట్టామన్నారు. దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు ఉద్దేశించిన డిండి ఎత్తిపోతల పథకం దాదాపు 80శాతం పూర్తయిందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేసేంతవరకు ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామని పేర్కొన్నారు. మరోవైపు భువనగిరి వద్ద బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తయిందని, గోదావరి జలాలతో ఆ ప్రాంతానికి నీరిచ్చామన్నారు. దామరచర్ల వద్ద 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ చేపట్టామని, 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మరో రెండు నెలలు పనులు చేస్తే ఆ ప్లాంట్ ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా, పదేళ్లలో ఎంతో కష్టపడి అన్నింటినీ ఎదుర్కొని రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపామని వివరించారు. కృష్ణాజలాల్లో హక్కుల సాధన జీవన్మరణ సమస్య అని, బతుకు పోరాటమని అన్నారు. నదీ జలాలపై హక్కుల కోసం ఊపిరి ఉన్నంతవరకు పోరాడతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మంత్రులు సోయిలేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో ఉమ్మడి రాష్ట్రంలోనే బాగుండేనని వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడే బాగుంటే, ఇదే జిల్లాకు చెందిన శ్రీకాంతాచారి ఎందుకు అమరుడయ్యేవాడని, ఇంత పెద్ద ఉద్యమం ఎందుకు వచ్చేదని ప్రశ్నించారు. రైతుబంధు నిధుల కోసం అడిగితే రైతులను చెప్పుతో కొడతామంటున్నారని, కానీ రైతులు కూడా చెప్పులతో కొడితే 32 పళ్ల రాలిపడతాయని హెచ్చరించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, తమకంటే నాలుగు ఎక్కువ మంచిపనులు చేసి ప్రజల మెప్పుపొందేందుకు కాంగ్రెస్ యత్నించాలని హితవు పలికారు. ప్రతిపక్షంలో ఉండాలని ప్రజలు తీర్పిచ్చారని, ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ప్రతిపక్షంగా పోరాడతామన్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు అధికారంలో ఉండి పాలించాలని, వారిని సమస్యలపై వెంటాడతామని, బలాదూర్ తిరిగితే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వహించాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.



సభలో కేసీఆర్ అభివాదం



సభ సక్సెస్‌తో బీఆర్ఎస్ నేతల్లో సమరోత్సాహం

రాష్ట్రంలో అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి వచ్చాక, మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో నిర్వహించిన తొలిసభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాకు జీవన్మరణ సమస్యగా పేర్కొంటున్న కృష్ణాజలాల హక్కుల సాధనకు పోరాడేందుకు స్వయంగా కేసీఆర్ నల్లగొండను కార్యక్షేత్రంగా ఎంచుకోవడంతో ప్రతిపక్షంగా బలమైన గొంతుకను నల్లగొండ నుంచి వినిపించినట్లయిందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లోనూ ఉమ్మడిజిల్లాలో ప్రజల తరఫున బలమైన ఉద్యమాలు నిర్వహించేందుకు ఈ సభ నైతిక మద్దతు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు సమన్వయంతో సభ విజయవంతానికి కృషి చేశారు.

రెండు నెలలుగా సాగర్‌ను ఎవ్వరూ పట్టించుకోలేదు

- అనారోగ్యాన్ని లెక్కచేయకుండా బెబ్బులిలా వచ్చిన కేసీఆర్
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు అవతలి చేతికి వెళ్తుంటే రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెలే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలో జరిగిన కృష్ణాజలాల పరిరక్షణ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కరువు, ఆకలి చావులను పెంచితే కేసీఆర్ సీఎం అయ్యాక నల్లగొండ జిల్లా నుంచి వాటిని తరిమికొట్టారన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ పాలనలో ఫ్లోరోసిస్ మహమ్మారితో చాలా మంది చనిపోయారని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చారన్నారు. నల్లగొండ జిల్లాలో 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా బెబ్బులిలా పోరాటం చేయడానికి వచ్చారన్నారు. కేసీఆర్ నల్లగొండకు వస్తున్నారనగానే కాంగ్రెస్ నేతలకు భయం పట్టుకొని నోటికివచ్చినట్టు చెత్తగా మాట్లాడుతున్నరన్నారు. కేసీఆర్ ఇచ్చిన 24 గంటల విద్యుత్‌ను మాయం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు.

కాంగ్రెస్ నిర్ణయం గొడ్డలిపోటు

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



నల్లగొండ: సాగర్‌ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రానికి గొడ్డలిపోటు లాంటిదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ, తొమ్మిదిన్నర ఏళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం సహకరించకుండా, కృష్ణాజలాల్లో వాటా తేల్చకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మిషన్‌కాకతీయ కింద 46వేల చెరువులకు పునరుజ్జీవం కల్పించామన్నారు. గతంలో నల్లగొండ జిల్లాలో 1,200 ఫీట్లలో బోరు వేసినా నీళ్లు పడకపోయేవని, చెరువుల్లో పూడిక తీతతో బోర్లలో నీళ్లు పెరిగాయన్నారు. కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. నల్లగొండ సభ రాజకీయ ప్రేరేపిత సభ కాదని, కృష్ణాజలాల్లో హక్కుల సాధన, పరిరక్షణ కోసం జరిగిన సభ అన్నారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. సభలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు కేటీఆర్, హరీష్‌రావు, మహమూద్ అలీ, కేశవరావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, నామా నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, బండా నరేందర్‌రెడ్డి, గాదరి కిషోర్, రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లను పూర్తి చేయకుండా

మోసం చేసిన కేసీఆర్

డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

కుర్చీలో కేసీఆర్ ఫొటో పెట్టి కాంగ్రెస్ నిరసన



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. నల్లగొండలో కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఖాళీ కుర్చీలో గులాబీ రంగు టవాల్ వేసి కేసీఆర్ ఫొటో పెట్టి గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను వివరిస్తూ ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. కేసీఆర్‌వన్నీ దొంగ హామీలని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్‌ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కేసీఆర్‌కు నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గ్రహించి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అన్నిస్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ మోసాలు చూసి జిల్లా ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభివృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజలను నమ్మించిన కేసీఆర్ ఏముఖం పెట్టుకొని నల్లగొండకు వస్తాడని నిలదీశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్లగొండలో అడుగుపెట్టి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల త్యాగాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటు చేస్తే కేసీఆర్ దొరల పాలన సాగించాడని విమర్శించారు. ప్రజలకు ఏ మాయమాటలు చెప్పినా ఇంకా నమ్మేస్థితిలో లేరన్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో పాలన సాగించిందే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నల్లగొండ జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీలు మనిమద్దె సుమన్, నాగులవంచ విజయలక్ష్మి, నాయకులు జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్, నాంపల్లి భాగ్య, రేఖల భద్రాద్రి, బషీర్, సమద్, జూలకంటి శ్రీనివాస్, కత్తుల కోటి, ఇంతియాజ్, జూలకంటి సైదిరెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, ఇబ్రహీం, దుబ్బరూప అశోక్‌సుందర్, నంద్యాల వీరబ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ గత హామీలను వింటున్న నేతలు

హెచ్ఎండీఏ రియల్ వ్యాపారం

- ల్యాండ్ పూలింగ్ ద్వారా వెంచర్ల ఏర్పాటు
- ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి



చౌటుప్పల్, ఫిబ్రవరి 13: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) త్వరలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టనుంది. ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా నగరశివారు ప్రాంతాల్లో భూములను సేకరించి వాటిని అభివృద్ధి చేసి వెంచర్లుగా రూపొందించేందుకు సన్నాహాలు చేస్తోంది. రోజురోజుకూ నగరం విస్తరిస్తుండడంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అందులో భాగంగా ప్రభుత్వం నగర శివారు ప్రాంతాల్లో అసైన్డ్ భూములపై దృష్టి కేంద్రీకరించింది. సంబంధిత రైతులతో మాట్లాడి, వారిని ఒప్పించి భూములు సమీకరించి వెంచర్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

శివారు ప్రాంతాల అభివృద్ధి

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ జనావాసాలు పెరుగుతుండటంతో కొత్త ప్రాంతాల అభివృద్ధి ఆవశ్యకతగా పెరిగింది. నగరంపై ఒత్తిడి తగ్గించేందుకు నివాస సముదాయాలు, వాణిజ్య వ్యాపార సముదాయాలు, టౌన్‌షిప్‌ల నిర్మాణం తప్పనిసరిగా మారింది. నగరంలో ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో శివారు ప్రాంతాలైన ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇక్కడ లేఅవుట్లు చేసేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో నగరంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా హెచ్ఎండీఏ చేసిన వెంచర్లలో ప్లాట్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి కావు. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాల్లో లేఅవుట్లు చేసి మధ్యతరగతి ప్రజలకు ప్లాట్ల ధరలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల సమ్మతితో భూములను తీసుకొని వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. రైతుల భూములపై ప్రాథమిక అధ్యయనం కూడా హెచ్ఎండీఏ చేసింది. రైతులతో ప్రాథమికంగా చర్చించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే కొంతమంది రైతులు సానుకూలత వ్యక్తం చేయగా, మరి కొంతమంది ఆలోచిస్తామని, ఇంకొంతమంది నిరాకరించినట్టు సమాచారం.

అసైన్డ్ భూముల్లో వెంచర్లు

జాతీయ రహదారులు, పట్టణాలు, ప్రధాన గ్రామాలు, ప్లాట్లు, ఇండ్ల నిర్మాణాలకు డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అసైన్డ్ భూముల్లో వెంచర్లు చేసి లబ్ధి పొందేందుకు ప్రభుత్వం యత్నిస్తుంది. అసైన్డ్ భూములను లబ్ధిదారుల అంగీకారంతో ల్యాండ్ పూలింగ్ చేయనుంది. భూములను వెంచర్లు చేసి ప్లాట్లుగా విభజించి మౌలిక సదుపాయాలు కల్పించి, రైతులు ఇచ్చిన భూముల విస్తీర్ణాన్ని బట్టి అందులో వారికి కొంత భూమి ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్థలాలపై రైతులకు సర్వహక్కులు ఉంటాయని,అందులో వారు ఇంటిని కూడా నిర్మించుకోవచ్చుని, లేదంటే విక్రయించుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కొన్నిచోట్ల భూముల ధరలు రైతుల డిమాండ్ బట్టి కొంత ఎక్కువ స్థలాన్ని ఇవ్వాలని ప్రభుత్వం సమాలోచన చేస్తోంది.

జిల్లాలో పలు ప్రాంతాల ఎంపిక

జిల్లాలో ఇప్పటికే కొన్ని ప్రాంతాలను హెచ్ఎండీఏ ఎంపిక చేసింది. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో సుమారు 300ఎకరాలు భూమిని సేకరించి భారీ లేఅవుట్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణకు రైతులతో సంప్రదింపు చేసినట్టు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాంతంలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రభుత్వం రైతుల నుంచి అసైన్డ్, పట్టా భూములు సేకరించింది. మళ్లీ హెచ్ఎండీఏ వెంచర్ కోసం భూ సేకరణకు సన్నాహాలు చేస్తోంది. అదేవిధంగా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం, బీబీనగర్ మండలంలోని రహీంఖాన్‌గూడ, భువనగిరి మండలం అనంతారం, పోచంపల్లి మండలం మెహర్‌నగర్‌లో వెంచర్ల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

60 శాతమా.. 1,000గజాలా?

వెంచర్ల ఏర్పాటు కోసం హెచ్ఎండీఏ సేకరించనున్న భూముల్లో రైతులు ఎంత వాటా ఇస్తారనేదానిపై చర్చ సాగుతోంది. దీనికి అధికారులు రెండు రకాల ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. ఒక ఎకరం విస్తీర్ణం 4,840 చదరపు అడుగులు ఉంటుంది. అందులో రోడ్లు, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాలకు 50శాతం భూమి పోగా, 2,420 చదరపు గజాల భూమి ఉంటుంది. అభివృద్ధి చేసిన ఈ భూమిలో రైతులకు 60శాతంవాటా కేటాయించి, 40శాతం భూమిని విక్రయించాలన్న ఒక ప్రతిపాదన. భూమి ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన భూమిలో 1,000 గజాలు కేటాయించి, మిగతా 1,420 గజాల భూమిని విక్రయించాలన్నది హెచ్ఎండీఏ రెండో ప్రతిపాదన. దీనిపై సంబంధిత అధికారులు ప్రభుత్వంతో పూర్తిస్థాయిలో చర్చించి నిర్ణయానికి రానున్నారు. ఇదిలా ఉండగా, హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చేందుకు ఎక్కువ శాతం మంది రైతులు ఆసక్తి చూపడం లేదని సమాచారం. కొంతమంది రైతులు భూమికి బదులు భూమి కేటాయిస్తే ముందుకు వచ్చే పరిస్థితి ఉంది.

ఇదేం నిర్వహణ?

బాలసదన్ నిర్వాహకులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుల ఆగ్రహం

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 13: పిల్లలకు ఆశ్రయం కల్పించే బాలసదన్ నిర్వహణ ఇలాగేనా అని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలసదంలో విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మి అనే మహిళ తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో కమిషన్ సభ్యురాలు సాయిని విజయభారతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సభ్యులు మంగళవారం బాలసదన్‌కు చేరుకొని విచారణ నిర్వహించారు. మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి నిర్వహణ తీరును తెలుసుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు అందజేస్తున్న మెనూ, దాతలు ఇచ్చిన వస్తువులు, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులపై ఆరా తీశారు. నాసిరకం వస్తువుల కొనుగోలుపై అసహనం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా బాలసదన్‌కు వచ్చిన నిధులు వాటి వినియోగం, దాతలు ఇచ్చిన వస్తువులు వాటి వినియోగంలో తేడాలు ఉండడంతో వివరణ అడిగి తెలుసుకున్నారు. ఏళ్లుగా ఒక్కరే సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న విషయంపై ఆరా తీసి, ఇంత కాలంగా ఎందుకు పని చేస్తున్నారని అడిగితెలుసుకున్నారు. దీనికి కారణాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సుమారు 5గంటలకు పైగా కమిషన్ సభ్యులు విచారణ నిర్వహించారు. ఇదిలా ఉండగా, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతిని స్థానిక విద్యుత్ విశ్రాంతి గృహంలో కలెక్టర్ హరిచంద్రన కలిసి స్వాగతం పలికారు.అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్‌శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, గిరిజన సంక్షేమశాఖఅధికారి రాజకుమార్,సీడీపీవో, తదితరులు ఉన్నారు.



జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరిచందన

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీస్ అధికారుల బదిలీ

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలలో చేపడుతున్న బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. తాజాగా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలైన పోలీస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

పోలీస్ అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ.రమేష్‌కుమార్	సైబర్‌సెక్యూరిటీ డీఎస్పీ	యాదాద్రి ఏసీపీ
కే.శివరాంరెడి	ఏసీపీ, యాదాద్రి	ఎస్‌డీపీవో, నల్లగొండ
ఎం.శ్రీధర్‌రెడ్డి	ఎస్‌డీపీవో, నల్లగొండ	ఎస్‌డీపీవో, కోదాడ
జీ.ప్రకాష్	ఎస్‌డీపీవో, కోదాడ	డీటీసీ డీఎస్పీ ఆదిలాబాద్
మదన్‌మోహన్‌రెడ్డి	సీసీఎస్, హైదరాబాద్	డీఎస్పీ, ఎస్‌బీ, నల్లగొండ
జీఎస్ నారాయణ	డీఎస్పీ ఎస్‌బీ, నల్లగొండ	ఏసీపీ, సైబారాబాద్
వి.రవికుమార్	అదనపు డీసీపీ, యాదాద్రి	అదనపు ఎస్పీ, ఇంటలిజెన్స్
బి.రాములునాయక్	అదనపు ఎస్పీ, సంగారెడ్డి	అదనపు ఎస్పీ, నల్లగొండ

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 13: మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్టు మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ డిపోకు చెందిన 20 బస్సులను భద్రాద్రి కొత్తగూడ నుంచి జాతరకు నడిపిస్తామనిన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ఈ నెల 16న పంపిస్తామన్నారు. జాతర సందర్భంగా రవాణా సేవలందించేందుకు వరంగల్ ఆర్టీసీ డిపోకు మరికొంత మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను పంపుతున్నట్టు వివరించారు.



ఆర్టీసీ డీఎం పాల్

జేఈఈ మెయిన్స్‌లో జయ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సూర్యాపేటలోని జయ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జయవేణుగోపాల్

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన జయ కళాశాలకు చెందిన 21మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ఆ కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. మంగళవారం సూర్యాపేటలోని ఆ కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కళాశాల మొదటి బ్యాచ్‌లోనే 21మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో 90శాతానికిపైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. కె.వెంకటేష్ 99.75, జి.చందన 99.56, హర్షిణి 98.97, కె.సిద్దార్థన్98.57, విష్ణుతేజ 97.90, సాయిశివరంజన్‌రెడ్డి 97.64, జె.గౌతమ్ 97.36, ఎస్.దీక్షిత 97.21, టి.శ్రీలక్ష్మి 96.71, కె.అభిజిత్ 96.65, లాస్యశ్రీ 95.89, వివేక్‌రెడ్డి 95.41, రాంచరణ్ 95.24 శాతం పర్సంటైల్ సాధించారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. జయ కళాశాల స్థాపించిన మొదటి బ్యాచ్‌లోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బింగి జ్యోతి, పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి శాస్త్రోక్తంగా

నాగవల్లీదళార్చన

రూ.22.65లక్షల ఆదాయం

తంబాకు కోసం హత్య చేసిన వ్యక్తికి

జీవిత ఖైదు

●వివరాలు 5లో..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, మరొకరు రైతు, ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగి, మేకలకాపరి, గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారు.


కిషోర్(ఫైల్)

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13 : నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందాడు. మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న హోంగార్డును కారు ఢీకొనగా డివైడర్ దాటి పడిపోయాడు. అదే సమయంలో అటుగా వచ్చిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత ప్రయాణిస్తున్న కారు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కారు సడన్ బ్రేక్ వేయడంతో ఎమ్మెల్యే నందితకు కూడా గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న కిషోర్(45)కు నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను అప్పగించారు. నల్లగొండ పట్టణ పరిధిలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై చర్లపల్లి వద్ద చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీనుతో కలిసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు వస్తున్న కారు అతివేగంగా వస్తూ ముందు ఉన్న ట్రాలీ ఆటోను తప్పించబోయే క్రమంలో రోడ్డుపై ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న హోంగార్డు కిషోర్, కానిస్టేబుల్ శ్రీనులను బలంగా ఢీకొట్టింది. దీంతో కిషోర్ రోడ్డుకు అవతలి వైపు ఎగిరిపడగా అప్పుడే నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలై కిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో కానిస్టేబుల్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ఎమ్మెల్యే నందిత ముందుభాగాన్ని ఢీకొనడంతో స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఆమె మరో కారులో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇదిలాఉండగా హోంగార్డు కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారు ఢీకొట్టడంతో...

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి పట్టణ పరిధి మాలిపురం గ్రామానికి చెందిన జోగు ప్రసాద్(40) బీసీ హాస్టల్‌లో ఔట్ సోర్సింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో శుభమస్తు ఫంక్షన్ హాల్ వద్ద స్కూటీపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు కాగా, భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలంలోని బహూపేట స్టేజీ వరంగల్-హైదరాబాద్ జాతీయరహదారిపై తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తిప్పర్తి మండలంలో రైతు..


వెంకట్‌రెడ్డి మృతదేహం

తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంతయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు సిరిగిరి వెంకట్‌రెడ్డి(45) మంగళవారం సాయంత్రం దుప్పలపల్లి వద్ద ఉన్న పొలానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు.ఈ క్రమంలో అంతయ్యగూడెం గ్రామస్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న టీఎస్07జేఎస్ 3950 కారు వెనక నుంచి వేగంగా ఢీకొట్టడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరెడ్డికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సతీష్ తెలిపారు.

కొత్తగూడెంలో బైక్ ఢీకొని మేకల కాపరి


అంజయ్య(ఫైల్)

మాడ్గులపల్లి : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో బైక్ ఢీకొని మేకల కాపరి మృతి చెందాడు.ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన సింగం అంజయ్య(56) వ్యవసాయం చేస్తూనే మేకలు కాస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి కిరాణ సరుకుల కోసం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి దాటుతుండగా నల్లగొండ వైపు వెళ్తున్న బైక్ అతివేగంతో అంజయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంజయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

వలిగొండ, ఫిబ్రవరి 13 : ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం మొగిలిపాక గ్రామానికి చెందిన గీతకార్మికుడు పబ్బు అయిలయ్య(48) ఈ నెల 6న ఇంట్లో టీ పెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అయిలయ్య సోదరుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అయిలయ్యకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్షేత్రపాలకుడికి శాస్త్రోక్తంగా
నాగవల్లీదళార్చనలు


పాతగుట్ట ఆలయంలోని ఆంజనేయుడికి నాగవల్లీదళార్చనలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రబవరి 13: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు ఆగమ శాస్త్ర రీతిలో కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి, అనుబంధ పాతగుట్ట, శివాలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,65,293 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

గులాబీలో జోష్

- కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించిన నాయకులు, అభిమానులు
- నల్లగొండ ప్రధాన రహదారి గులాబీ జెండాల మయం
- ఈలలు, కేరింతలతో సభలో కార్యకర్తల హల్‌చల్


సభకు హాజరైన ప్రజలు, అభిమానులు


మాజీ మంత్రి ఎర్రబెల్లితో ముచ్చటిస్తున్న సూర్యాపేట, యాదాద్రి జిల్లా జడ్పీ చైర్మన్లు సందీప్‌రెడ్డి, దీపిక


వేదికపై జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, రవీంద్రనాయక్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి అజయ్‌కుమార్


వేదికపై జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సునీత, గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, మునుగోడుకు చెందిన రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి


వేదికపై కేటీఆర్‌తో అభిమాని సెల్ఫీ


తిరుగు ప్రయాణంలో హెలీకాప్టర్ నుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం

నల్లగొండ, ఫిబ్రవరి 13: నల్లగొండ పట్టణంలో బీఆర్ఎస్ సభతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తల, నాయకుల వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు, దేవరకొండ రోడ్డు, పానగల్లు రోడ్డు, నార్కట్‌పల్లి రోడ్డు ప్రాంతాల్లో వివిధ జిల్లాల నుంచి వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రయాణిస్తున్న బస్సును ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు అడ్డుకున్న సమయంలో, ప్రాంగణానికి చేరకున్న సమయంలో ట్రాఫిక్‌లో బస్సు చిక్కుకుపోయింది. దేవరకొండ రోడ్డు మార్గం గుండా వచ్చిన వాహనాలను లక్ష్మీగార్డెన్స్, ఎల్లమ్మగుడి సమీపంలో, చర్లపల్లి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేయించారు. సూర్యాపేట, మిర్యాలగూడ నుంచి వచ్చిన వాహనాలను ఆర్జాలబావి ఐకేపీ కేంద్రాల వద్ద ప్రాంతాలతో పాటు మరో మూడు చోట్ల వాహనాలను నిలిపివేశారు. పలు చోట్ల లారీలను డీసీఎంలను రోడ్ల వెంట నిలిపివేయడంతో పోలీసులు వాహనాలను పార్కింగ్ ప్రాంతాలకు తరలించేలా చేశారు. అంబులెన్స్‌లకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కేసీఆర్ సభ సైడ్‌లైట్స్


సభా ప్రాంగణంలో ఈల వేస్తున్న కార్యకర్త

- గడియారం సెంటర్ నుంచి మర్రిగూడ బైపాస్ వరకు కట్టిన బీఆర్ఎస్ పార్టీ తోరణాలతో ప్రధాన రహదారి గులాబీమయమైంది.
- కార్యకర్తల వాహనాలతో బైపాస్ రోడ్డు ట్రాఫిక్ జామ్ కాగా, ఇదే సమయంలో ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- మధ్యాహ్నం 2 గంటల నుండే వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- కళాకారులు తమ ఆటపాటలతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.
- సాయంత్రం 4.48 నిమిషాలకు కేసీఆర్ హెలికాప్టర్ సభా ప్రాంగణం కొంత దూరంలో దిగింది.
- 4.59 నిమిషాలకు కేసీఆర్ కార్యకర్తలకు అభివాదం చేస్తూ వాకర్ సాయంతో వేదికపైకి వచ్చారు.
- 5.09 నిమిషాలకు జై తెలంగాణ నినాదంతో ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్, 5.49 నిమిషాల వరకు 40 నిమిషాల పాటు ప్రసంగించారు.
- కేసీఆర్‌ను చూసేందుకు, ప్రసంగాన్ని వినేందుకు వేదికకు ఎదురుగా ఉన్న భవనంపై కొంతమంది కార్యకర్తలు ప్రమాదాన్ని కూడా లెక్క చేయకుండా ఎక్కి ఆసక్తి కనపరిచారు.
- కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో సౌండ్ సిస్టమ్ మొరాయించడంతో సభలో కూర్చున్న హరీశ్ రావు లేచి వచ్చి సౌండ్ సిస్టమ్‌ను సరి చేయించారు.
- అదేపనిగా సౌండ్ సిస్టమ్ అంతరాయం కలగడంతో కేసీఆర్ కలుగజేసుకుని కొంపతీసి నీవు అక్కడోనివా అంటూ సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడిని అనడం సభలో ఉన్న కార్యకర్తలను నవ్వించింది.
- సభలో కొంతమంది కార్యకర్తలు ఈలలు వేస్తూ అంతరాయం కలిగిస్తుండగా ఏయ్..! ఎవడయ్యా వాడు... ఆపు ఆపు అంటూ కేసీఆర్ హెచ్చరించారు.
- ప్రతిపక్షాలపై సామెతలు, తిట్లతో కేసీఆర్ ప్రసంగం సాగింది.
- కేసీఆర్ ప్రసంగిస్తుండగా కార్యకర్తలు అత్యుత్సహంతో తోసుకోవడంతో వారిని ఆపడం పోలీసుల తరం కాలేదు. దీంతో చేయి చేసుకోవాల్సిన పరిస్తితి ఏర్పడింది.
- కేసీఆర్ ప్రసంగం నడుస్తుండగానే దూర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తిరుగుముఖం పట్టడం కనిపించింది.

● రామగిరి



సభా ప్రాంగణంలో సమీపంలోని కటౌట్, భవంతి ఎక్కి తిలకిస్తున్న కార్యకర్తలు


కేసీఆర్ వేదిక పైనుంచి దిగి వస్తుండగా సెల్‌ఫోన్లలో బంధిస్తున్న అభిమానులు


జీవో 46ను రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కానిస్టేబుళ్ల అభ్యర్థులు


హెలిప్యాడ్ వద్ద మాజీ సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి

కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికిన నేతలు

నల్లగొండ, ఫిబ్రవరి 13 : కృష్ణా జాలాల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన చలో నల్లగొండ సభకు హాజరైన మాజీ సీఎం కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ తక్కెనపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.


వేదిక వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ


నల్లగొండలో బీఆర్ఎస్ నాయకుల బస్సుపై కోడి గుడ్లను విసిరిన ఎన్ఎస్‌యూఐ నాయకులు


బస్సును అడ్డుకుంటున్న ఎన్ఎస్‌యూఐ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తంబాకు కోసం హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

మిర్యాలగూడ లీగల్, ఫిబ్రవరి 13 : తంబాకు ఇవ్వలేదని తోటి వ్యక్తిని బండరాయితో కొట్టి చంపిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ గుప్తాపై హత్యా నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జీ వేణు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో యాష్ ప్లాంట్ నిర్మాణానికి బెకం కంపెనీ బీహార్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 300 మంది కార్మికులను పనుల్లోకి తీసుకుంది. వీరిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రఘునందన్‌రామ్ కార్పెంటర్‌గా, బీహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్‌గుప్తా హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. మద్యానికి, ఖైనీ(తంబాకు)కు బానిసైన ఓంప్రకాశ్‌గుప్తా విధులకు సక్రమంగా హాజరు కాకపోయేవాడు. ఈ క్రమంలో 2023 ఏప్రిల్ 24న మధ్యాహ్నం ప్లాంట్ సమీపంలో ఉన్న రఘునందన్‌రామ్ దగ్గర ఖైనీ(తంబాకు) ప్యాకెట్ ఉన్నది చూసి కొద్దిగా ఖైనీ ఇవ్వమని ఓంప్రకాశ్‌గుప్తా అడిగాడు. దీంతో రఘునందన్‌రామ్ ఇవ్వనంటూ బూతులు తిడుతూ ప్లాంట్ వైపు వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న ఓంప్రకాశ్‌గుప్తా కోపంతో పక్కనే ఉన్న బండరాయితో అతడి తలపైన కొట్టి చంపాడు. ఘటనపై జనరల్ మేనేజర్ బండారు రంగనాథ్ ఫిర్యాదు మేరకు అప్పటి వాడపల్లి హెడ్‌కానిస్టేబుల్ అహ్మద్ హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, అప్పటి మిర్యాలగూడ రూరల్ సీఐ ఎం.సత్యనారాయణ దర్యాప్తు పూర్తి చేసి నిందితుడు ఓంప్రకాశ్‌గుప్తాను హత్యానేరం కింద అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచాడు. 12మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఓంప్రకాశ్‌గుప్తాకు జీవితఖైదు, జరిమానా విధించింది.

జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుడు ఓంప్రకాశ్‌గుప్తా జ్యుడిషియల్ రిమాండ్‌లోనే ఉన్నందున శిక్షా కాలంలో కస్టడీ కాలాన్ని మినహాయించాలని న్యాయమూర్తి తన తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ మన్నెం మనోహర్‌రెడ్డి కేసు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు వాడపల్లి కోర్టు కానిస్టేబుల్ ఎంఏ యూనిస్, కోర్టు లైజన్ అధికారి సైదులు సహకరించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.34.97లక్షలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన హుండీని మంగళవారం లెక్కించారు. 54 రోజులకు రూ.34,97,065ల ఆదాయం సమకూరినట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. గుట్టపైన ప్రధానాలయంతో పాటు ఉపాలయాల వద్ద ఉన్న హుండీ లను తెరిచి లెక్కించగా రూ.30,84,725లు వచ్చాయి. గుట్ట కింద పార్వతీ అమ్మ వారి ఆలయం వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.4,12,340లు లభించాయని పేర్కొన్నారు. నిత్యాన్నదాన పథకం వద్ద ఉన్న హుండీల ద్వారా రూ.31,982లు లభించాయి. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, పరిశీలకురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తెల్లరేషన్‌కార్డు ఉన్నవారు ఈకేవైసీ చేయించుకోవాలి

దేవరకొండ, ఫిబ్రవరి 13: దేవరకొండ డివిజన్ పరిధిలో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులందరూ సమీప రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈకేవైసీ నమోదు ప్రచార వాహనాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 29వ తేదీ వరకు ఆహారభద్రత కార్డులకు కేవైసీ వేలిముద్ర వేసేందుకు చివరితేదీ అని రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఈకేవైసీ వేలిముద్ర నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర శంకర్, చిలువేరు శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించాలి

నల్లగొండ, ఫిబ్రవరి 13: విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించాలని విద్యావేత్త ఎంవీ. గోనారెడ్డి కోరారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి స్పెల్ విజార్డ్ డ్రామా పోటీల్లో మాట్లాడారు. ఆంగ్ల భాష ప్రాముఖ్యం తెలుసుకొని విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలనారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, ఆధోని, అబ్బాస్‌అలీ, బాలరాజు, నూనె విష్ణు, రాధాకిషన్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకట్, సాగర్, మాధవి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

దేవరకొండ, ఫిబ్రవరి 13: దేవరకొండలో ఈ నెల 11న జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో 25మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆర్డీవో శ్రీరాములు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీటీలు క్రీడాకారులను అభినందించారు. ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాలు అందుబాటులోకి వచ్చేలా చూస్తామన్నారు. క్రీడాకారులకు షీల్డు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు మాస్టర్ శ్రీను, తాళ్ల శ్రీధర్, కృష్ణకిశోర్, భాస్కర్‌రెడ్డి, ఉమమహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు జాతరకు ఏర్పాట్ల పరిశీలన

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నల్లగొండ ఆర్డీవో రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ నుంచి, నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డుపై బైపాస్ దారి నుంచి, ఏపీలింగోటం నుంచి, హెరిటేజ్ పాల సంస్థ, గుమ్మళ్లబావిల మీదుగా నాలుగు రోడ్లు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఎల్లారెడ్డిగూడెం, బైపాస్ నందుల ఆర్చి నుంచి మాత్రమే ఎక్కువ సంఖ్యలో భక్తుల రాకపోకలు ఉంటాయి. గత ఏడాది ఈ దారుల్లో వాహనాల పార్కింగ్ కోసం ప్రైవేట్ వ్యక్తుల భూములను అద్దెకు తీసుకుని పార్కింగ్ చేసేవారు. అక్కడ ఇళ్లు నిర్మించడంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది. అందుబాటులో ఉన్న స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు వినయోగించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మ, ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఆర్‌ఐ తరుణ్ ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

మునుగోడు, ఫిబ్రవరి 13: మునుగోడులో పునఃనిర్మాణం చేసిన శ్రీభక్త మార్కండేయ ఆలయంలో స్వాముల విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవేడుకలు మూడో రోజు మంళవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం సుప్రభాతసేవ, ఉపనిషత్ పారాయణం, మండపార్చనలు, శిల్ప అంగవైకల్య, మూలమంత్ర, బీజాక్షర, రుద్ర, మృత్యుంజయ హోమాలు, మహానివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మండపార్చనలు, జలదివాస విమోచనం, మూర్తి, అవాహిత దేవతా హోమాలు, ధనాది, ధాన్యది, పుష్పాది, ఫలాది, శయనాది వాసములతో పాటు మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. అర్చకులు నవీన్‌కుమార్ అర్చక బృందం సాంప్రదాయ బద్ధంగా పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గుర్రంపోడు, ఫిబ్రవరి 13: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. మండలంలో వరి పంటలను మంగళవారం పరిశీలించారు. వాతావరణ ఆధారిత సమస్యలో భాగంగా అగ్గితెగులు, జింకులోపం, కాండం తొలుచు పురుగు బారిన పడే అవకాశాలు ఉన్నాయని, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ 1.5 మిల్లీ లీటర్ల కాసంగా మైసిన్ 2.5 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచుపురుగు నివారణకు పిలకలు లేదా దుబ్బు దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు ఎకరానికి పది కిలోల చొప్పున వేసిన రైతులు పొట్ట దశలో 0.3 ఎంఎల్ క్లోరంటానిలిప్రోల్ లేదా 0.5మిల్లీమీటర్ల టెట్రానిలిప్రోల్ మందును లీటరునీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత చలి వాతావరణం పరిస్థితుల్లో వరిలో ప్రధానంగా జింకుదాతు లోపం ఎక్కువగా ఉంటుందని దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరునీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నేడు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

నకిరేకల్, ఫిబ్రవరి 13: మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మెన్, ఉమెన్, జూనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో నిర్వహించే 52వ సీనియర్ మెన్, ఉమెన్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1-1-2004 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్‌కార్డు, 10వ తరగతి మార్కుల మెమో తీసుకురావాలని కోరారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

మునుగోడు, ఫిబ్రవరి 13: కేంద్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ ప్రభారి పాపారావు, రాష్ట్ర నాయకుడు కడగంచి రమేష్ అన్నారు. మునుగోడులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ఈ నెల 22న భువనగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహించే బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ బిక్షంగౌడ్, నారాయణయాదవ్, దోనూరి వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోమటి వీరేశం, వేదాంతం గోపీనాథ్, వేణుకుమార్, బొడిగె అశోక్‌గౌడ్, ముంగి ధనుంజయ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మిర్యాలగూడలో ర్యాలీ ప్రారంభిస్తున్న తిప్పన విజయసింహారెడ్డి



చిట్యాల నుంచి బయలుదేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



హాలియాలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న భగత్, సుందర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బహిరంగసభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు జిల్లావ్యాప్తంగా భారీగా తరలివెళ్లారు. మిర్యాలగూడ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి మిర్యాలగూడలో కార్యకర్తల బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణాజలాల్లో రాష్ట్ర వాటను కాపాడడంలో ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తున్న జిల్లా ప్రజల ఉద్యమానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకే మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ సభ నుంచి శంఖారావం పూరిస్తారన్నారు. నియోజకవర్గం నుంచి వివిధ వాహనాల్లో సుమారు 10వేల మంది సభకు తరలివెళ్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతరెడ్డి శ్రీవాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జునాచారి, నల్లమోతు సిద్దార్థ, పెద్ది శ్రీనివాసగౌడ్, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, లక్ష్మీనారాయణ, పత్తిపాటి నవాబ్, కందగట్ల అశోక్, సాధినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో 10వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. దేవరకొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి డీసీఎం వాహనాలు, కార్లలో నల్లగొండ బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు రవీంద్రకుమార్ తెలిపారు.

మర్రిగూడ: మండలం నుంచి జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు నల్లగొండకు తరలివెళ్లారు.

చింతపల్లి: ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించవద్దని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన నల్లగొండ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించకుండా రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకిరాగానే కేంద్రంతో కుమ్మకై ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడంతో తెలంగాణ రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా నేతలు నట్వ గిరిధర్, అండేకార్ అశోక్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 20వాహనాల్లో బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. హాలియాలో మాజీ ఎమ్మెల్యేలు జాజుల సురేందర్, నోముల భగత్ వాహనాలను జెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి డీసీఎంలో నల్లగొండకు తరలివెళ్లారు.

చిట్యాల: చిట్యాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ జెండాలు చేతబూని వివిధ వాహనాల్లో కార్యకర్తలు మీటింగ్‌కు వెళ్లారు. కార్యక్రమంలో శేపూరి రవీందర్, మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, పొన్నం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: చిట్యా మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు నల్లగొండకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకుడు పల్లపు బుద్ధుడు మాట్లాడుతూ కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులపై పెత్తనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం చేతుల్లో పెడుతుందన్నారు. అదే జరిగితే తెలంగాణ మళ్లీ ఎడారిగా మారుతుందన్నారు. మన నీళ్లు, మన హక్కుల కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రూపానీ లక్ష్మయ్య, యాదయ్య, భద్రయ్య, స్వామి, నర్సింహ, ప్రవీణ్, శ్రీను, రాంబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించి కేసీఆర్ భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు కొండమల్లేపల్లి మండల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బయల్దేరి వెళ్లారు.

యువతకు ఉపాధి మార్గాలు చూపాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: ఉన్నత చదువులు చదివిన యువతకు ఉపాధి మార్గాలు చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఫిబ్రవరి 16న తలపెట్టి గ్రామీణ బంద్, సమ్మె విజయవంతానికి కార్యాచరణ రూపొందించేందుకు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలుతో కలిసి స్థానిక సిఐటీయు భవన్‌లో నిర్వహించిన మంగళవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుల ఊబిలో మగ్గుతున్న రైతుల పంటలకు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రజల్ని మతం కొయ్యలకు వేలాడదీసి సంపదను దొడ్డిదారిన ఆదానీ లాంటి పెట్టుబడిదారులకు అప్పగించేందుకే మోదీ ప్రభుత్వం తపిస్తోందన్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం విచ్చలవిడిగా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందన్నారు. 16న జరిగే సార్వత్రిక గ్రామీణ బంద్, సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి వస్కుల మట్టయ్య, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పిల్లుట్ల సైదులు, గోవర్ధిని, కరీమున్నీసా, నాయుడు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

● ఈ నెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య కోరారు. మిర్యాలగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతత్వ విధానాల ప్రతిఘటనకు ప్రజలంతా పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నూకపంగ నాగయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు చాంద్ పాష పాల్గొన్నారు.



మిర్యాలగూడ: రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

కొండమల్లేపల్లి: గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఈవో వీరబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మత తత్వ విధానాలను నిరసిస్తూ నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వస్కుల అలివేలు, కుంభం ముత్యాలు, అందుగుల మధు, వస్కుల మంగమ్మ, అందుగుల పూలమ్మ, వస్కుల రాములమ్మ, ఊశమ్మ, భారతమ్మ, శ్రీను, లింగమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చింతపల్లిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సోమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె. శంషొద్దీన్, మల్లోజు శేఖరచారి, శ్రీకాంత్, వి.నర్సింహ, శేఖర్, సైదమ్మ, వెంకటయ్య, గౌస్య, మణెమ్మ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాల ప్రతిభ

నల్లగొండ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో నల్లగొండకు చెందిన ఎస్ఆర్ కళాశాల ఇంటర్ సెండియర్ విద్యార్థులు 25 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన బొల్లా అక్షిత రెడ్డి 94.09 శాతంతో కళాశాల టాపర్‌గా నిలిచారని, మంచుకొండ వైశాలి 92.96, జీడిమాదల వర్ష 88.58, వీరమళ్ల యోగేష్ 84.61, భూషిపాక సౌదామిని 80. 55 శాతం పొంది అత్యున్నత ప్రతిభ కనబరిచారి తెలిపారు. మొత్తం 42 మంది పరీక్ష రాయగా అందులో 25 మంది అర్హత సాధించారని, మంగళవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యజమాన్యం అట్టి విద్యార్థులకు స్వీట్లు అందజేసి అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ జోనల్ ఇంచార్జి సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు రాజశేఖర్‌రెడ్డి, కమలాకర్, అరుణ్‌కుమార్, ఏట సరితా రెడ్డి, అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, నాగబాబు, ప్రవీణ్, పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రగతి కళాశాల విద్యార్థులు

జేఈఈ మెయిన్ -2024 ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్. హరిచక్రవర్తి 96.92, నిఖిల్ 96.12, యూనూస్ అలీ 96,00, జశ్వంత్ 95. 15, ముకసిత్ 94.92, వైష్ణవి 92,90, రేణుమనీస్ 89.86, అనూష 89. 77, దీప్తి 88.32, యశ్వంత్ సాయి హరిహర 87.95శాతంతో 36 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు నరేందర్‌బాబు, శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, రమేష్‌రెడ్డి అభినందించారు.

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ టౌన్: పట్టణంలోని ఏకలవ్య ఉన్నత పాఠశాల చెందిన నలుగురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్ సాధించారు. పాఠశాలకు చెందిన పి. సాయిచరణ్ 99.56, వి. సాయిమణికంఠ 99.56, జి శ్రీసహస 99.52, కె. అర్జున్‌కృష్ణ 99.19 పర్సంటైల్ సాధించారు. మరో 30మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ అల్లుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్లు మారం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు

మిర్యాలగూడ టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కేఎల్ఎన్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోట నవ్య 93.2, చెన్నా పవన్‌కుమార్ 92.3 పర్సంటైల్ సాధించారని, మరో పది మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, పీఎల్ఎన్‌రెడ్డి అభినందించారు.

కాంట్రాక్టు పనులను రీ-టెండర్లు వేయాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: సివిల్ సప్లయ్ స్టేజీ-2 కాంట్రాక్ట్ పనులకు రీ-టెండర్లు వేయాలని కాంట్రాక్టర్లు కూరెళ్ల శివశంకర్, వెంకటాచారీ, కుమ్మరి సందీప్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారులను పక్కదారి పట్టించి పాత వారికే తిరిగి టెండర్లు దక్కేలా సాగించిన వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. 2023-25 సంవత్సరానికి సంబంధించి సివిల్ సప్లయ్ స్టేజీ-2 మండల లెవలింగ్ స్టాకిస్ట్ (ఎంఎల్ఎస్) కాంట్రాక్టు పనుల కోసం ఈ నెల 1న నుంచి 9వ తేదీలోగా టెండర్లు వేసేందుకు సివిల్ సప్లయ్ ప్రకటన చేశారన్నారు. ఒక్కో ఎంఎల్ఎస్‌కు ఎంతమందైనా టెండరు వేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఎనిమిది ఎంఎల్ఎస్‌లు ఉండగా ఒక్కోదానికి 15నుంచి 20 టెండర్లు దాఖలయ్యేవన్నారు. ప్రస్తుతం తేదీలను ప్రచారం చేయకపోవడంతో మొత్తం ఎంఎల్ఎస్‌లకు కేవలం 20 మాత్ర మే టెండర్లు కాగా వాటిలో కొన్నింటికీ సింగిల్ టెండర్లే దాఖలయ్యాయన్నారు. పాత కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చేలా అధికారులు వ్యవహరించినట్లు తెలుస్తోందన్నారు. మొత్తం వ్యవహారంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, సివిల్‌సప్లయ్ డీఎం, డీఎస్‌వో విచారణ జరిపి రీ-టెండర్లు పిలిచి తేదీలను విస్తృతంగా ప్రచారం చేసి అర్హులైన కార్పొరేషన్ టెండర్ దారులకు న్యాయం చేయాలని కోరారు.

ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: కార్మికులంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధిం చుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. రెడ్డీల్యాబ్ పరిశ్రమలో పనిచేస్తున్న టీఆర్ఎస్‌కేవీ యూనియన్ కార్మికులు జూలకంటి సమక్షంలో మంగళవారం సీఐటీయూలో చేరారు. టీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు అంబటి నాగేందర్, మాజీ అధ్యక్షుడు జనార్ధన్ నాయకత్వంలో సుమారు 20మంది కార్మికులు సీఐటీయూ చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు అవుతా సైదులు, సుధాకర్, రమణ, చామంతి వెంకటేశ్వర్లు, లింగయ్య, రాములు, సైదులు ఉన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించాలి

హాలియా, పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 13: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గంధం పద్మావతి అన్నారు. ప్రాజెక్టు అనుముల పరిధిలోని హాలియా కేజీబీవీ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో మంగళవారం బాలికలకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత రాకుండా రాగిజావలాంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. నిరక్షరాస్యతపై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సువర్ణ, సూపర్‌వైజర్ కె.రమాదేవి, హైస్కూల్ హెచ్ఎమ్ కృష్ణమూర్తి, పీటీ వెంకట్‌రాంరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ హైమావతి పాల్గొన్నారు. పెద్దఅడిశర్లపల్లి మంగళవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో వైద్యుల ఆధ్వర్యంలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సంబంధించి రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత కలిగిన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రసూల్, ప్రిన్సిపల్ మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫార్మసిస్ట్ గిరి, ఏఎన్ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 13: వేగం వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న పంటకాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై మండలంలోని కిష్టాపురం గ్రామం వద్ద మంగళవారం జరిగింది. రూరల్ ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన కొమరవెల్లి మహేందర్‌రెడ్డి తన కారులో కుటుంబసభ్యులతో కలిసి చెన్నైలోని తమ సమీపబంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని స్వస్థలానికి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లడంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో మల్లారెడ్డి తీవ్రంగా గాయపడగా, కారు డ్రైవర్ మహేందర్‌రెడ్డి, భవ్య, చిన్నారి శ్రీనిశ్‌రెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రాథమి చికిత్స చేశారు. తీవ్రగాయాలైన మల్లారెడ్డిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కారు డ్రైవర్ మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను అమలు చేయాలి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13: నూతన ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలతో పాటు గృహజ్యోతి, పింఛన్ పెంపు పథకాలను అర్హులైన వారందరికీ అమలయ్యేలా త్వరితగతిన ప్రారంభించాలని సీపీఐ నల్లగొండ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి కోరారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడంలో విఫలమైందన్నారు. పేదల ఇళ్ల స్థలాల కోసం పట్టణంలోని అనేశ్వరమ్మ గుట్ట సమీపంలో గల భూముల కోసం సీపీఐ పోరాటం చేసిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు శిరస్సు వీరయ్య, పుట్టల జ్యోతి, కౌసల్య, కోటేశ్, విజయ్‌రెడ్డి, తాళ్ల గిరి, వల్కి యాదమ్మ, పాలకూరి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అజ్జలాపురంలో కందిపంట దగ్ధం

కనగల్, ఫిబ్రవరి 13: మండలంలోని హైదలాపురం (అజ్జలాపురం) గ్రామానికి చెందిన మహిళా రైతు ఆదిమళ్ల సరిత తనకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో కందిపంటను సాగు చేసింది. కొద్దిరోజుల క్రితం కాసిన చేనును కోసి అదేభూమిలో మెదలుగా కందికట్టెను కుప్పలు వేసింది. తీరా కల్లం చేసుకునే సమాయానికి పంట మొత్తం అగ్గి పాలైంది. వీరిభూమి పక్కనున్న రైతు ఆదిమళ్ల రమేష్ మంగళవారం మధ్యాహ్నం గెట్టుకున్న గడ్డికి నిప్పు పెట్టగా అదికాస్త పెద్ద మంటలుగా మారి కందికట్ట కుప్పలను అంటుకుంది. చూస్తుండగానే మంటల తాకిడికి చేతికందిన పంట కాలిబూడిదైంది. సుమారు లక్షన్నర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయింది. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని ఆమె కోరింది.

సంక్షిప్త సమాచారం..

తిప్పర్తి: తిప్పర్తి తహసీల్దార్ పి. పద్మ మాడ్గులపల్లి మండలానికి బదిలీ అయ్యారు. కట్టంగూర్ తహసీల్దార్ స్వప్న తిప్పర్తికి వచ్చారు.

నకిరేకల్: నకిరేకల్ మునిసిపల్ కమిషనర్ బాలాజీ కొత్తూరు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న సందర్భంగా కౌన్సిలర్లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, గాజుల సుకన్య శ్రీనివాస్, యాసారపు లక్ష్మి వెంకన్న, చౌగోని రజిత పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: అచ్చంపేట మార్కెట్ చైర్మన్ అరుణపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గౌరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో చందా ధనుంజయ్య, సముద్రాల కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

కనగల్ : మండలంలోని చినమాదారం గ్రామ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎం. పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

గట్టుప్పల్: ఇ-వ్యర్థాలు తొలగించడం అనే అంశంపై నల్లగొండ డైట్ కళాశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో తేరట్‌పల్లి పాఠశాల 6వ తరగతి విద్యార్థి ఎర్ర రక్షణ జిల్లాస్థాయికి ఎంపికైందని పాఠశాల సాంస్కృతిక ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ తెలిపారు. గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు సాయిరాం, ఉదావత్ లచ్చిరామ్‌ను హెచ్‌ఎం నరసింహ, రాణి, మల్లేశం, వెంకటేశ్వర్లు అభినందించారు.

మర్రిగూడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాంరెడ్డిపల్లి గ్రామవాసి పగిళ్ల వెంకటేష్ కుటుంబానికి రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎన్నమనేని దామోదర్‌రావు కుమారుడు ఎన్ఆర్ఐ ఎన్నమనేని ప్రదీప్‌కుమార్‌రావు సహకారంతో రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పగిళ్ల రాములు, సత్యనారాయణ, రమేష్, వెంకటంపేట బాలయ్య, పగిళ్ల నర్సింహా, చంద్రయ్య, దేవ వెంకటేష్ ఉన్నారు.

కట్టంగూరు: కట్టంగూరుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సరిపల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పార్టీ కట్టంగూర్ పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి 50 కేజీల బియ్యం అందజేశారు.

కట్టంగూరు: దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంకణాల శోభరాణి, మాచర్ల యాదమ్మ, మంగమ్మ, ఎల్లమ్మ, సరిత తదితరులు ఉన్నారు.

కట్టంగూరు: కట్టంగూరులో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు శ్రీలక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్ తెలిపారు. 16న అంకుర్పారణ, అఖండ దీపారాధన, 17న గణపతి హోమం, నవగ్రహ హోమం, 18న దుర్గ హోమం, 19న రుద్రహోమం, 20న కల్యాణం నిర్వహిస్తున్నామని తెలిపారు.

దామరచర్ల: వాడపల్లి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవిని యువజన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పరంగి సురేష్, షేక్ మజ్జు, పరంగి రమేష్, కొడాలి ప్రశాంత్, పరంగి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేందర్ కుటుంబానికి అతని స్నేహితులు రూ.31వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మురారి, సైదులు, ఉస్మాన్, పాష, కప్పల సైదులు, నగేష్, శివశంకర్, సత్తి, ఉపేందర్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతికి నార్కట్‌పల్లిలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, సీడీపీవో హరిత, ఆర్‌ఐ తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

హాలియా: విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్ తెలిపారు. హాలియా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 18వ తేదీన నిర్వహించే టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దోసపాటి నవీన, మ్మంపాడు సాయి పాల్గొన్నారు.

హాలియా: ప్రజాస్వామ్య బద్ధంగా రాష్ట్ర గీతాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గీత రచయితలలో ఒకరైన శ్రీకళారాంమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాష్ట్ర గీతాన్ని ఏర్పాటు చేయాలని హాలియాలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర గీతంపై పునారాలోచన చేసి రాష్ట్ర గీతాన్ని 2014 జూన్‌కు ముందు ఉన్న గీతాలలో అర్హత ఉన్న గీతాలన్నింటిని కూడా పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర గీతాన్ని ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చిట్యాల: చిట్యాల మునిసిపల్ కమిషనర్‌గా పి. వీరేందర్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న రామదుర్గారెడ్డి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వీరేందర్ రంగారెడ్డి జిల్లా కొత్తూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

చిట్యాల రూరల్: గుండ్రాంపల్లిలో యువకులు నిర్వహిస్తున్న గ్రంథాలయానికి ఎన్ఆర్ఐ నక్కర్తి రామాచారి తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ-సత్తెమ్మల జ్ఞాపకార్థ రూ.70 వేల విలువైన కంప్యూటర్‌లు, ప్రింటర్లు, సీసీ కెమరాలు అందజేశారు. ఆయన సోదరుడు నక్కర్తి శ్రీనివాస్‌చారి, సోమిరెడ్డిల ద్వారా గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటుకు గుండ్రాంపల్లి గ్రంథాలయం స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో వెల్లంకి లక్ష్మణాచారీ, శివలింగం, శ్రీనివాస్, కుమారస్వామి, బాలరాజు, రామచంద్రం, వెంకటేశం, చిట్టిబాబు, అంజయ్యచారి, విజయ్‌కుమార్ బొడిగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో వెదిరె బ్రదర్స్ సొంత నిధులతో మరుగుదొడ్ల నిర్మించేం దుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. పనులను ఐసీడీఎస్ అధికా రులు మంగళవారం ప్రారంభించారు. తల్లి వెదిరె పూలమ్మ జ్ఞాపకార్థం సొంత నిధులతో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు పంపినట్లు వెదిరె సోదరులు మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి తెలిపారు.

కొండమల్లేపల్లి: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ సంబరాలు పోటీల్లో పాల్గొన్న కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతి విద్యార్థిని ఆర్.నవ్య జాతీయ సైన్స్ సంబరాల పోటీల్లో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎ ంపిక కాగా వక్తృత్వ పోటీల్లో బి.స్పందన జిల్లాస్థాయిలో 2వ స్థానంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాస్ తెలిపారు.